ANN తెలుగు
Follow: @ANNTELUGU
20-11-2025
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 332 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఇదేమైనా యుద్ధమా?

### హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తారా?

- మావోయిజం లేకుండా చేస్తామని అమిత్ షా ఎలా చెప్తారు?
- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** మావోయిస్టు అగ్ర నేత హిడ్మాను చంపి.. దాన్ని ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల అంశంపై చర్చించేందుకు గురువారం నాడు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిడ్మా కోరితే ఆశ్రయం ఇచ్చే వాళ్లమని అన్నారు. అతన్ని తానే డీజీపీకి సరెండర్ చేయించేవాడిని అని పేర్కొన్నారు. హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్ అని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే విచారణకు ఆదేశించాలి..**

ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలు తెలుసుకోవాలని కూనంనేని సూచించారు. ఇలా చంపడం సరికాదని..

మిగతా 2లో

టాప్ న్యూస్

నా పేరుతో మోసం...

## ఎవరీ ఇడియట్?

- నటి శ్రియ ఫైర్


08



## బీహీరో

- పదోసారి సీఎంగా నితీష్
- డిప్యూటీలుగా సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా..
- ప్రధాని మోదీతో పాటు హాజరుకానున్న ఎన్డీయే నేతలు..

03



షేక్ హసీనా అప్పగింతకు

## భారత్ విముఖత

- రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసేలా బంగ్లాదేశ్ సన్నాహాలు

03



## కోటి మంది మహిళలకు
# చీరల పంపిణీ షురూ

### లాంఛనంగా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

- డిసెంబర్ 9 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ పూర్తి
- మార్చి 1 నుండి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో పంపిణీ
- గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మందికి చీరెలు
- ప్రస్తుతం గోడౌన్లలో దాదాపు 60 లక్షల చీరెలు సిద్ధం
- నాణ్యమైన పట్టు చీరెలు.. బతుకమ్మ చీరెల్లా కాకుండా ప్రతిష్ఠాత్మకంగా తయారీ
- పండుగలా మండల కేంద్రాల్లో పంపిణీ కార్యక్రమాలు

**హైదరాబాద్ మహా:** తెలంగాణ సర్కారు ఇందిరమ్మ చీరెల పంపిణీని షురూ చేసింది. కోటిమంది మహిళలకు చీరెల పంపిణీ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా దీనిని ప్రారంభించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రారంభించి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం (డిసెంబరు 9) నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) వరకు పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు అందజేస్తారు.

మిగతా 2లో



## గ్రేటర్ హైదరాబాద్.. ఎన్నికలకు సై

### 2020 డిసెంబర్ 1న ఎన్నిక

- ఫిబ్రవరి 2021లో ఏర్పడ్డ పాలకవర్గం.. సై అంటున్న పొలిటికల్ పార్టీలు
- ముఖ్యమంత్రి వ్యూహంపై సర్వత్రా ఉత్కంఠ
- రెండునెలల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలంటున్న బీఆర్ఎస్
- ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నగారా మోగించిన సర్కార్
- డిసెంబర్ లో పంచాయతీ.. జనవరిలో పరిషత్ ఎన్నికలు
- మార్చిలో మునిసిపల్ ఎన్నికలు.. ఇక ఎన్నికలే.. ఎన్నికలు



**హైదరాబాద్ -మహా:** తెలంగాణలో ఇపుడు ఏ కాలం నడుస్తుంది అంటే ఎన్నికల కాలం అని చెప్పొచ్చు. జూబ్లీహిల్స్ లో ఘనవిజయంతో ఫుల్ జోష్ లో ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీ పెండింగ్ ఎన్నికలన్నీ ఫటాఫట్ జరిపించేయాలను కుంటోంది. గ్రేటర్ హైదరాబాద్ లోని రెండు బైపోల్స్ గెలిచి జోష్ లో ఉన్న కాంగ్రెస్.. మరో బైపోల్ కు కూడా సై అంటోంది. జీహెచ్ఎంసి ఎన్నికలు చివరిసారి 2020 డిసెంబర్ 1న జరగ్గా, ఎవరికీ మెజారిటీ రాని కారణంగా.. ఆలస్యంగా ఫిబ్రవరి 2021లో మేయర్, డిప్యూటీమేయర్ ఎన్నిక జరిగింది. దీంతో జీహెచ్ఎంసి కార్పోరేటర్లంతా మాజీలు కానున్నారు. ఇక్కడ ఎన్నికల నిర్వహణకు రాజకీయపార్టీలు సై అంటున్నాయి. హైదరాబాద్ పై సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక విజన్ ఉండగా, జీహెచ్ఎంసి ఎన్నికలు ఏ క్షణమైనా రావొచ్చు.

వివరాలు 2లో

## ఓడిన చోటే గెలిచి చూపిద్దాం

- జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

వివరాలు 2లో



# గ్రేటర్ హైదరాబాద్.. ఎన్నికలకు సై

## 2020 డిసెంబర్ 1న ఎన్నిక

- ఫిబ్రవరి 2021లో ఏర్పడ్డ పాలకవర్గం
- సై అంటున్న పొలిటికల్ పార్టీలు
- సీఎం వ్యూహంపై సర్వత్రా ఉత్కంఠ
- రెండు నెలల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలంటున్న బీఆర్ఎస్
- ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నగారా మోగించిన సర్కార్
- డిసెంబర్ లో పంచాయతీ.. జనవరిలో పరిషత్ ఎన్నికలు
- మార్చిలో మునిసిపల్ ఎన్నికలు
- ఇక ఎన్నికలే.. ఎన్నికలు




**హైదరాబాద్ మహా:** తెలంగాణలో ఇపుడు ఏ కాలం నడుస్తుంది అంటే ఎన్నికల కాలం అని చెప్పొచ్చు. జూబ్లీహిల్స్ లో ఘనవిజయంతో ఫుల్ జోష్ లో ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీ పెండింగ్ ఎన్నికలన్నీ ఫటాఫట్ జరిపించేయాలనుకుంటోంది. గ్రేటర్ హైదరాబాద్ లోని రెండు బైపోల్స్ గెలిచి జోష్ లో ఉన్న కాంగ్రెస్.. మరో బైపోల్ కు కూడా సై అంటోంది. జీహెచ్ఎంసి ఎన్నికలు చివరిసారి 2020 డిసెంబర్ 1న జర్గగా, ఎవరికీ మెజారిటీ రాని కారణంగా.. ఆలస్యంగా ఫిబ్రవరి 2021లో మేయర్, డిప్యూటీమేయర్ ఎన్నిక జరిగింది. దీంతో జీహెచ్ఎంసి కార్పోరేటర్లంతా మాజీలు కానున్నారు. ఇక్కడ ఎన్నికల నిర్వహణకు రాజకీయపార్టీలు సై అంటున్నాయి. హైదరాబాద్ పై సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక విజన్ ఉండగా, జీహెచ్ఎంసి ఎన్నికలు ఏ క్షణమైనా రావొచ్చు. రెండునెలల్లో జీహెచ్ఎంసి ఎన్నికలు రాబోతున్నాయని అపుడు మా తడాఖా చూపుతామంటూ బీఆర్ఎస్ నేత హరీష్ రావు బుధవారం జూబ్లీహిల్స్ సమీక్షా సమావేశంలో అన్నారు. గత జీహెచ్ఎంసి ఎన్నికల్లో బీఆర్ఎస్ బొక్క బోర్లాపడి 56 సీట్లకే పరిమితమైంది. కాంగ్రెస్ కేవలం రెండుస్థానాలే సాధించింది. బిజెపి గత ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 48 స్థానాలు సాధించగా, వాటిని నిలుపుకోవడం పెద్ద సవాల్. ముఖ్యమంత్రి వ్యూహం ఆధారంగా జీహెచ్ఎంసి ఎన్నికలు జరగనున్నాయి.

**పంచాయతీకి గ్రీన్ సిగ్నల్**

పంచాయతీ ఎన్నికలకు సర్కారు పచ్చజెండా ఊపింది. వారం, పదిరోజుల్లో షెడ్యూల్ రానుండగా, డిసెంబర్ లో వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నేపథ్యంలోనే చీరల పంపిణీ కార్యక్రమానికి సర్కారు శ్రీకారం చుట్టిందన్న ప్రచారముంది. ఇక జనవరిలో పరిషత్ ఎన్నికలు జరగనుండగా, ఆ సమయానికి రైతుభరోసా కూడా రైతుల ఖాతాల్లో జమ చేసే అవకాశాలున్నాయి. మూడువిడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తిచేసే అవకాశాలున్నాయి.

**సంక్రాంతి సమయంలో పరిషత్ ఎన్నికలు**

సంక్రాంతి సమయంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తిచేసే అవకాశాలున్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిసిన తర్వాత 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులకు అనుగుణంగా ఏకాభిప్రాయం తీసుకొచ్చి ఎన్నికలు జరిపించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

**ఫిబ్రవరిలో జీహెచ్ఎంసీ ఎన్నికలు**

ఫిబ్రవరి లో జీహెచ్ఎంసి పాలకవర్గం అంతా మాజీలు కానుంది. గడువు ప్రకారమే జీహెచ్ఎంసి ఎన్నికలు నిర్వహించి హైదరాబాద్ పై పూర్తి పట్టు బిగించాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. విలీన మునిసిపాలిటీలు, పంచాయతీలు కూడా జీహెచ్ఎంసిలో భాగం కానున్నాయి. అయితే జీహెచ్ఎంసిగానే ఎన్నిక జరుగుతుందా? దీనిని సీఎం ఏ విధంగా మారుస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది.

**మార్చిలో మునిసిపల్ ఎన్నికలు**

పరిషత్ ఎన్నికలు ముగిశాక మునిసిపల్ ఎన్నికలపై ఫోకస్ పెట్టాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ముఖ్యమంత్రి స్థానిక ఎన్నికలన్నీ 2026లో పూర్తిచేసి క్యాడర్ లో జోష్ నింపాలని డిసైడ్ అయ్యారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పోరేషన్ ఎన్నికలన్నీ మార్చి, ఏప్రిల్ లో పరీక్షలకు ఇబ్బందులు కాకుండా పూర్తిచేసే అవకాశాలున్నాయి.

**సమ్మర్ లో బైపోల్స్**

ప్రచారం జరుగుతున్నట్లు ఖైరతాబాద్, స్టేషన్ ఘన్ పూర్ బైపోల్స్ వస్తే కేరళ, తమిళనాడులతో కలిపి మేలో వచ్చే అవకాశాలున్నాయని అంచనాలున్నాయి. ఈ లెక్కన ఆరునెలల పాటు ఎన్నికల కాలమే తెలంగాణలో ఉండనుంది. ఇక ఎన్నికలు ఏవైనా ఒక నెల అటు ఇటు అయితే .. ఈ ఏడాదంతా ఎన్నికల కాలమే కానుంది.

# ఓడిన చోటే గెలిచి చూపిద్దాం

**జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కండి**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు**




**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ఫలితాలు, పార్టీ బలోపేతంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేటీఆర్.. ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఓడిన చోటే గెలిచి చూపిద్దాం" అంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దివంగత గోపీనాథ్ మరణానంతరం ఆయన సతీమణి సునీతమ్మ గెలుపు కోసం కేసీఆర్ నుంచి బూత్ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పనిచేశారని ప్రశంసించారు. రేపు రాబోయే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం తాము మరింత కష్టపడి, "కాలికి బలపం కట్టుకొని తిరుగుతాం" అని హామీ ఇస్తూ కార్యకర్తల్లో భరోసా నింపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**కర్ణాటక నుంచి మనుషులను తెచ్చి దొంగ ఓట్లు..**

ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు అక్రమాలకు పాల్పడ్డాయని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కర్ణాటక నుంచి మనుషలను తెచ్చి దొంగ ఓట్లు వేయించుకున్నారని, షేక్ పేట, ఎర్రగడ్డ వంటి ప్రాంతాల్లో రిగ్గింగ్ చేశారని మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకుని, డబ్బు, మద్యం పంచి గెలిచారని విమర్శిస్తూ, ఇది నైతిక గెలుపు కాదని స్పష్టం చేశారు. వ్యక్తిగత విషాదంలో ఉన్నప్పటికీ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన హరీష్ రావును కేటీఆర్ ఈ సందర్భంగా కొనియాడారు. పార్టీ కార్యాలయాలు కార్యకర్తలకు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, ఏ కష్టం వచ్చినా పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

**స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా..**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ లోపు సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, ఆ వెంటనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని తెలిపారు. జూబ్లీహిల్స్ లోని 407 బూతుల్లో ఒక్కో బూత్ కు 10 మంది చొప్పున, మొత్తం 4 వేల మందితో పటిష్టమైన సైన్యాన్ని నిర్మించుకోవాలని సూచించారు. "ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలి" అనే సామెతను గుర్తు చేస్తూ, గతంలో నష్టపోయిన చోటే తిరిగి బలాన్ని పుంజుకోవాలని కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజల సమస్యలపై ఇప్పటి నుంచే పోరాటం మొదలుపెట్టాలని, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# పంచాయతీ షురూ

- **రిజర్వేషన్ల రోస్టర్ సిద్ధం చేస్తున్న యంత్రాంగం**
- **బీసీలకు 23, ఎస్సీ 17, ఎస్టీ 10 శాతం రిజర్వేషన్లు దక్కే అవకాశం**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను ప్రకటించింది. గురువారం నుంచి ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. ఈ నెల 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా బీసీ 23%, ఎస్సీ 17%, ఎస్టీ 10% కేటాయిస్తూ రిజర్వేషన్ల రోస్టర్ అధికారయంత్రాంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.



# అందెశ్రీ గొప్ప మేధావి

**మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్**

**హైదరాబాద్, మహా:** అందెశ్రీ గొప్ప మేధావి, రాజీ పడని మహనీయుడని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌లోని డీజీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన సహజకవి అందెశ్రీ సంతాప సభలో ఆయన పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరణించేంత వరకు పీడిత ప్రజల కోసం, సమాజంలోని అట్టడుగు ప్రజానీకం కోసం తపన పడ్డ మహనీయుడు అందెశ్రీ అని కొనియాడారు. ఆయనతో తనకు పాతికేళ్ళ పరిచయం ఉందని గుర్తు చేసుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి, చదువుకు దూరమైనప్పటికీ గొప్ప మేధస్సును సంపాదించుకున్న అందెశ్రీ, అప్పటికప్పుడు పెదాల మీదనే పాట రూపొందించేవారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అందరికీ స్ఫూర్తినిచ్చి ఐక్యం చేసిన "జయ జయహే తెలంగాణ" పాట తమకు కొత్త శక్తిని ఇచ్చిందని ప్రశంసించారు. అలాగే, "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు" అనే పాట యావత్ సమాజాన్ని కదిలించిందని, అది మానవ సమాజం ఉన్నంత కాలం ఉంటుందని పేర్కొన్నారు.

**జీవితంలో రాజీ పడని మహనీయుడు..**

అందెశ్రీ కులాల వారీగా, వృత్తుల వారీగా ప్రజలు అనుభవిస్తున్న బాధలు కళ్లకు కట్టినట్టు రాశారని అన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఆయన మూలాలను మర్చిపోలేదని, డబ్బు, పలుకుబడి వెంట పరుగులు తీయకుండా అతి సామాన్య జీవితం గడిపారని తెలిపారు. ప్రపంచంలో తెలుగు మాట్లాడే ప్రతి ఒక్కరికీ పరిచయం ఉన్నా.. ఏనాడు ఆ పరిచయాలను సొంత ప్రయోజనాల కోసం వాడుకోలేదని, జీవితంలో రాజీ పడని మహనీయుడని కొనియాడారు. ఆయన తపన, ఆరాటం పేదల కోసమేనని, అందుకే ఆయన అందరి గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని స్పష్టం చేశారు. ఆయన మన మధ్య లేకపోయినా ఆయన పాటలు, మాటలు సజీవంగా ఉంటాయని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అభిమానులందరికీ ధైర్యం అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# సీఎం కల.. క్యాబినెట్ లక్ష్యం

**3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధన దిశగా విజన్ డాక్యుమెంట్**

- ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ 2047 విజన్ డాక్యుమెంట్: డిప్యూటీ సీఎం
- విజన్ డాక్యుమెంట్ ను తుది దశకు తీసుకురావాలని అధికారులకు భట్టి ఆదేశం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ గత రెండు సంవత్సరాల్లో సాధించిన ప్రగతి, రాష్ట్ర భవిష్యత్తును ప్రపంచానికి చూపడమే 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్' లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు సాయంత్రం ప్రజాభవన్ లో అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో కలిసి ఏర్పాటు చేసిన 2047 విజన్ డాక్యుమెంట్ వార్ రూమ్ సమావేశ మందిరంలో ఆయన ప్రసంగించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ కల అని, ఆ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరం ఆలోచిస్తున్నాం, అడుగులు వేస్తున్నామని భట్టి విక్రమార్క వివరించారు. ఈ లక్ష్య సాధనలో అందరినీ భాగస్వాములు చేసి సమగ్ర డాక్యుమెంట్ రూపొందించే బాధ్యతను ముఖ్యమంత్రి తనకు అప్పగించారని తెలిపారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తో అధికారిక ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా ఇప్పటికే వివిధ శాఖల నుంచి నోడల్ ఆఫీసర్లను నియమించి, వారి ద్వారా వచ్చిన సమాచారం మేరకు ISB బృందం ప్రాథమిక కసరత్తు పూర్తి చేసిందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ వచ్చే నెల 8, 9 తేదీల్లో జరగనుందని, తక్కువ సమయం ఉన్నందున పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి విజన్ డాక్యుమెంట్ ను తుది దశకు తీసుకురావాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన అనేది చరిత్రలో లిఖించదగిన అంశమని ఆయన వివరించారు. ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు, వాటి అమలు, చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించే ప్రయత్నం చేశామని తెలిపారు. డిసెంబరు 9 తో ప్రభుత్వం రెండవ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా, రెండు సంవత్సరాల్లో ఏం చేశామని చెప్పడం కంటే కూడా, భవిష్యత్ తరాలకు మేలు చేకూరేలా ఏ విధమైన పునాదులు వేయబోతున్నాం, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీపడేలా ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నాం అనే విషయాలను ప్రపంచానికి డాక్యుమెంట్ ద్వారా వివరించనున్నట్టు తెలిపారు. సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, సంజయ్ కుమార్, వికాస్ రాజ్, ఉన్నతాధికారులు శ్రీధర్, మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, నవీన్ మిట్టల్, హరీష్, బుద్ధ ప్రకాష్, కృష్ణ భాస్కర్, ముషారఫ్ అలీ, నాగిరెడ్డి, చౌహాన్ పాల్గొన్నారు.



## ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివి

**చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇందిరా గాంధీ సేవలు, సంస్కరణలు అందరికీ ఆదర్శం అని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం మాజీప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయతి సందర్భంగా, చేవెళ్ల పట్టణంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి, చేవెళ్ల శాసనసభ్యులు *"కాలే యాదయ్య"పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇందిరాగాంధీ గారు దేశానికి చేసిన సేవలు, అభివృద్ధి పనులు, సంస్కరణలు అందరికీ ఆదర్శం అని అన్నారు. దేశ సమగ్రతను కాపాడడంలో ఎక్కడ వెనక్కి తగ్గని నాయకురాలు ఇందిరాగాంధీ అని అన్నారు. ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలకు, సంస్కరణలు అందరికీ ఆదర్శం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తికి బాటలు వేసే చారిత్రక ఘట్టమిది

- వివక్ష తొలగింపునకు నిపుణుల సలహాలు కీలకం
- ఉమెన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క




**హైదరాబాద్, మహా:** మహిళల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, హక్కుల బలోపేతం కోసం రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేశామని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను పూర్తిగా తొలగించేందుకు నిపుణులు, మేధావులు, అధికారులు ఇచ్చే సూచనలు అత్యంత ఉపయోగకరమవుతాయని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో తెలంగాణ మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉమెన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీతక్క జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. కాన్ఫరెన్స్‌లో మహిళలకు ఉపాధి అవకాశాలు, వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, మహిళల భద్రత, ఆరోగ్యం, పోషకాహారం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. నిపుణుల అభిప్రాయాలు, సూచనలు, అనుభవాలను ప్రభుత్వం తెలుసుకుని భవిష్యత్ విధానాల్లో ప్రతిబింబింపజేయాలనే ఉద్దేశంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళా సంక్షేమం, భద్రత కోసం చట్టాలు ఉన్నప్పటికీ, సమాజపు పోకడల కారణంగా అవి ప్రాక్టికల్‌గా అమలుకావడంలో సమస్యలు వస్తున్నాయని, పని ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొనే సమస్యలను చెప్పుకునే అవకాశాలు కోల్పోతున్నారని మంత్రి వివరించారు. ఈ చర్చ రాజకీయ కార్యక్రమం కాదని, మహిళల భవిష్యత్తును నిర్ణయించే చారిత్రక ఘట్టం అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సీనియర్ ఐఏఎస్ అధికారులు సీతాలక్ష్మి, అనిత రామచంద్రన్, జి సృజన, శృతి ఓజా, ఐ& పీఆర్ కమిషనర్ ప్రియాంకా ఆల, అదనపు డీజీ. అభిలాష్ బిస్తోతో పాటు పలువురు మహిళా ఐపీఎస్లు, బాలల హక్కుల కమిషన్ సభ్యులు, నిపుణులు, మేధావులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలకు చీరల పంపిణీ షురూ




(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ప్రస్తుతం గోడౌన్లలో దాదాపు 60లక్షల చీరెలు సిద్ధంగా ఉండగా, షెడ్యూలు ప్రకారం వీటిని పంపిణీచేయనున్నారు.

**ఆడబిడ్డలందరికీ సారె**

హైదరాబాద్, మహా: 'మహిళల ఉన్నతి – తెలంగాణ ప్రగతి' కార్యక్రమం కింద కోటి మంది మహిళలకు 'ఇందిరా మహిళా శక్తి చీరల' పంపిణీ పథకాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీర పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టంచేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆడపడుచులకు సారె, చీర ఇవ్వడం సంప్రదాయమని, ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలందరికీ సారె అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

**ఫేషియల్ రికగ్నిషన్‌తో చీరల పంపిణీ..**

ఈ పథకం అమలు తీరును వివరిస్తూ, అన్ని జిల్లాల్లో మండల కేంద్రాల్లో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ విడతల వారీగా పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక అధికారిని నియమించి కార్యక్రమ బాధ్యతలను అప్పగించాలని, ముందుగానే ప్రజలందరికీ ఈ పథకం గురించి తెలియజేయాలని సూచించారు. చీరల పంపిణీని ఒక పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నది ప్రభుత్వ విధానమని, మున్సిపాలిటీలు, పట్టణాల్లో రెండో విడతలో చీరలు అందిస్తామని, ఏ ఒక్క మహిళకూ చీర అందలేదన్న సమస్య ఉత్పన్నం కావొద్దని స్పష్టం చేశారు. భవిష్యత్తులో చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు ఈ పంపిణీని ప్రామాణికంగా తీసుకునేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. పంపిణీలో పారదర్శకత కోసం కుల గణన సందర్భంగా సేకరించిన డేటాను, ఫేషియల్ రికగ్నిషన్‌తో పాటు ఆధార్ నంబర్ నమోదు చేసుకుని ఎక్కడా తప్పులు జరగకుండా పంపిణీ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

**కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా..**

మహిళా సాధికారతపై ముఖ్యమంత్రి ప్రధానంగా దృష్టి సారించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 27 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు అప్పగించడం వంటి అనేక చర్యల ద్వారా మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తేవాలని, శిల్పారామంలో ఇందిరా శక్తి బజార్ కేటాయించామని, అమెజాన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉత్పత్తులను విక్రయించుకునే అంశంపై సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. వడ్డీలేని రుణాలు అందించడంలో గతంలో జరిగిన నిర్లక్ష్యాన్ని సరిదిద్దుకుంటూ ప్రభుత్వం ముందుకు పోతోందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి మహిళా సమాఖ్య ప్రతినిధులు చీరల నాణ్యత, రంగు, డిజైన్ బాగున్నాయని ముఖ్యమంత్రితో మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# హరే కృష్ణ టెంపుల్ ఉత్సవాలు విజయవంతం

## భక్తులను మైమరపించిన బ్రహ్మోత్సవాలు.. గోవింద నామస్మరణతో మార్మోగిన హరే కృష్ణ టెంపుల్



**హైదరాబాద్, మహా:** నవంబర్ 14న ప్రారంభమైన హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ వార్షిక శ్రీ బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా ముగిశాయి. ఆరు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తాయి. చివరి రోజు ఉదయం మహా పూర్ణాహుతి, చక్రస్నానం కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాలలో 108కలశాల మహా చూర్ణాభిషేకం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వేద మంత్రోచ్చారణలు, హరినామ సంకీర్తనల మధ్య పవిత్ర కలశాలతో అభిషేకాలు జరిగాయి. శ్రీ రాధా గోవిందులు, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, శ్రీ నితాయి గౌరంగ, శ్రీల ప్రభుపాదుల వారికి పంచామృతం, ఫలరసాలు, వన మూలికల చూర్ణాలు, నవరత్నాలు వంటి ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. గంగా యమునతో సహా ఏడు పవిత్ర నదుల జలంతో ప్రత్యేక స్నానం నిర్వహించడం విశేషం. సాయంత్రం పుష్ప యాగంతో పాటు, రాత్రి మహా సంప్రోక్షణతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా మాట్లాడిన హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు సత్య గౌర చంద్రదాస ప్రభుజీ, స్వామి వారి దివ్య అనుగ్రహంతో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ఈ ఉత్సవాల ద్వారా సమాజానికి శాంతి, శ్రేయస్సుతో కూడిన ఆధ్యాత్మిక పురోగాభివృద్ధి చేకూరాలని తాము ప్రార్థిస్తున్నట్లు ఆయన చెప్పారు.



# రైతుల ఖాతాలో రూ.2 వేలు జమ

**తమిళనాడు, మహా:** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిధులు విడుదలయ్యాయి. బుధవారం ఈ పథకం కింద 21వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా తొమ్మిది కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ. 18వేల కోట్లకు పైగా నిధులు జమ కానున్నాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో భారత్ ప్రపంచానికి హబ్‌గా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది స్వదేశీ విధానమని, సంప్రదాయంగా వస్తోందని మోదీ వివరించారు. రైతులు ఏడాదికి ఒక ఎకరం చొప్పున క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని పిలుపునిచ్చారు. అలాగే రైతులు చేతులేత్తి తమ టవల్ను ఊపుడం చూస్తే బిహార్ గాలులు తన కంటే ముందే తమిళనాడులో వీచినట్లుగా ఉందని అన్నారు.

**11 ఏళ్లలో వ్యవసాయ రంగంలో భారీగా మార్పులు..**

'వాతావరణ మార్పులు, నేల సారం సమస్యలకు ప్రకృతి వ్యవసాయం, పంటల మార్పిడే పరిష్కారం. అధిక రసాయనాలు, పురుగుమందుల వాడకంతో నేలసారం బాగా దెబ్బతింటోంది. మిల్లెట్స్ సూపర్ ఫుడ్. వాటిని రైతులు సాగు చేయాలి. గత 11 ఏళ్లలో వ్యవసాయ రంగంలో భారీగా మార్పులు జరిగాయి. వ్యవసాయ ఎగుమతులు దాదాపు రెండింతలయ్యాయి. వ్యవసాయాన్ని ఆధునికత దిశగా తీసుకెళ్లేందుకు

## పీఎం కిసాన్ సాయం విడుదల చేసిన ప్రధాని

- 9 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్ల నిధులు జమ
- తమిళనాడులోని కోయంబత్తూరులో 21వ విడత నిధులు రిలీజ్
- ప్రకృతి వ్యవసాయంలో భారత్ ప్రపంచానికి హబ్‌గా మారుతుంది: మోదీ




ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రైతులకు సహాయం చేయడానికి అన్ని మార్గాలను విస్తృతంగా ప్రారంభించింది. రాబోవు సంవత్సరాల్లో భారత వ్యవసాయ రంగంలో అనేక భారీ మార్పులను చూడనున్నాం. ప్రకృతి వ్యవసాయానికి అంతర్జాతీయ హబ్‌గా మారే దిశలో భారత్ పయనిస్తోంది. మన జీవవైవిధ్యం కొత్త రూపు సంతరించుకుంటోంది. దేశ యువత వ్యవసాయాన్ని ఆధునికమైన, విస్తృతి కలిగిన అవకాశంగా చూస్తున్నారు. దీనివల్ల దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింతగా బలపడుతుంది.' అని ప్రధాని మోదీ అన్నారు.

**2019 ఫిబ్రవరి 24న స్కీమ్ ప్రారంభం..**

2019 ఫిబ్రవరి 24న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ప్రారంభమైంది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా కోట్లాది రైతులకు లబ్ధి చేకూరుతోంది. ఇప్పటి వరకు 20 విడతల్లో నిధులు విడుదలయ్యాయి. రూ.3.70 లక్షల కోట్లకు పైగా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. భూమి వివరాలు పీఎం, కిసాన్ పోర్టల్‌లో నమోదై ఉండి, బ్యాంకు ఖాతా ఆధార్‌తో లింక్ అయి ఉన్న రైతులకు ఈ పథకం ప్రయోజనాలు అందుతున్నాయి.

# బీహీరో.. పదోసారి సీఎంగా నితీష్

- డిప్యూటీలుగా సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా..
- ప్రధాని మోదీతో పాటు హాజరుకానున్న ఎన్డీయే నేతలు..

**మహా:** బీహార్ రాజకీయాల్లో నితీష్ కుమార్ పేరు రాజకీయ ఎత్తుగడలకు, సంకీర్ణ ప్రభుత్వాలకు పర్యాయపదంగా నిలుస్తుంది. దేశ రాజకీయాల్లో పదిసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రికార్డు ఆయనకు మాత్రమే సొంతం. ఆయన బీ.. హీరో. ఐదేళ్ల పాటు అధికారంలో ఉంటేనే ప్రభుత్వ వ్యతిరేక వస్తుంది. ఒకటి కాదు.. రెండు కాదు.. వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు జేడీ యూ అధినేత నితీష్‌కుమార్. బిహార్‌లో 20 ఏళ్ల నుంచి ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఇపుడు మరోసారి సీఎంగా బాధ్యతలు. బీహార్ తదుపరి ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ఖరారయ్యారు. ఈ మేరకు ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు.. తమ కూటమి నేతగా నీతీశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను కలిసి రాజీనామా సమర్పించారు. ఇందుకు గవర్నర్ కూడా ఆమోదం తెలిపారు. దీంతో నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా నితీశ్ పదోసారి ప్రమాణ స్వీకారం చేసేందుకు సిద్ధమయ్యారు. పట్నాలోని గాంధీ మైదాన్ వేదికగా నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్‌లతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీ నేత ప్రేమ్ కుమార్, డిప్యూటీ స్పీకర్ పదవి జేడీయూ అభ్యర్థికి ఇచ్చేందుకు ఎన్డీయే పక్షాలనడుమ అంగీకారం కుదిరినట్లు తెలిసింది. ఆయన తొలిసారిగా 2000 సంవత్సరంలో సీఎం అయ్యారు. కానీ మెజారిటీ సాధించకపోవడంతో 7 రోజుల్లోనే రాజీనామా చేశారు. ఆ తర్వాత 2005లో ఆర్జేడీ పాలనను అంతమొదిస్తూ భారీ విజయంతో తిరిగి అధికారంలోకి వచ్చారు. అప్పటినుండి ఇప్పటిదాకా ఆయన ఎవర్ గ్రీన్ పొలిటికల్ హీరోగా ఉన్నారు.

# గ్రేటర్ ఎన్నికల్లో జనసేన పోటీ

**హైదరాబాద్, మహా :** ఏపీలో మహా కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్న జనసేన తెలంగాణలో అడుగు పెట్టేందుకు సన్నద్ధమైంది. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు శ్రేణులు సన్నద్ధం కావాలని ఆ పార్టీ సంకేతాలను ఇచ్చింది. అధినేత పవన్ కళ్యాణ్ సూచన మేరకే గ్రేటర్ లో పోటీకి నిర్ణయించామని పార్టీ నేతలు ప్రకటించారు. హైదరాబాద్‌లో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీ పూర్తిగా సిద్ధంగా ఉందని జనసేన గ్రేటర్ అధ్యక్షుడు రాజలింగం ప్రకటించారు. ఎన్నికల ముందు పార్టీ శక్తి, వ్యూహాలపై చర్చించేందుకు ఆయన కూకట్‌పల్లిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీని మరింత బలపరచడం, కార్యకర్తలను సమీకరించడం ఇప్పుడు అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో కేడర్‌ను యాక్టివ్‌గా ఉంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జనసేన కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్, వీర మహిళ చైర్మన్ కావ్య, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విభాగాల వారీగా బాధ్యతలు, గ్రౌండ్ రిపోర్టులు, స్థానిక ఇష్యూలపై నాయకులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. సమావేశంలో గ్రేటర్ ఎన్నికల్లో జనసేన సత్తా చాటేందుకు పలు వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. బూత్ స్థాయి కేడర్‌ను బలోపేతం చేయడం, ప్రతి డివిజన్‌కు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయడం, యువత, మహిళలపై దృష్టి పెట్టడం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయని తెలిపారు. నాయకులు ప్రజల వద్దకు చేరుకునే డోర్‌టుడోర్ ప్రచార కార్యక్రమాలపై కూడా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు స్పష్టం చేశారు. స్థానిక ప్రజా సమస్యలు, జీహెచ్ఎంసీలో పరిష్కారం కావాల్సిన ముఖ్య అంశాలపై వర్క్‌లిస్ట్ తయారు చేయాలని నేతలకు సూచించారు. జీహెచ్ఎంసీలో ప్రస్తుతం 150 డివిజన్లు (కార్పొరేటర్ సీట్లు) ఉన్నాయి. ఈ 150 సీట్లలో 76 సీట్లు గెలిస్తేనే ఒక పార్టీకి స్పష్టమైన మెజారిటీ లభిస్తుంది. సాధారణంగా గ్రేటర్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఎక్కువగా ఉండటంతో.. ఈ మెజారిటీని సాధించడం కష్టంగా అభిప్రాయపడుతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఓటర్ల సంఖ్య కూడా భారీగా ఉంటుంది. తాజా లెక్కల ప్రకారం, నగరంలో మొత్తం 92.5 లక్షలకుపైగా ఓటర్లు నమోదు అయ్యారు.

# ఇదేమైనా యుద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టు చేసి చట్టం ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే విచారణకు ఆదేశించాలని అన్నారు. దేవ్‌జీ కూడా పోలీసుల చెరలో ఉన్నట్లు తెలుస్తోందని.. అసలు పోలీసుల చెరలో ఎంతమంది ఉన్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 2026 మార్చి నాటికి మావోయిజం లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇదేమైనా యుద్ధమా అని ఆయన ప్రశ్నించారు. దండకారణ్యంలో విలువైన ఖనిజ సంపద కోసమే ప్రభుత్వం మావోయిస్టులను హతమారుస్తుందని ఆరోపించారు. ఏకపక్ష కాల్పులను కూడా బండి సంజయ్ ఎన్‌కౌంటర్‌గా చెప్పడం దారుణమని మండిపడ్డారు. హింసను వీడి, శాంతియుత పరిష్కారాల దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని సూచించారు.

# షేక్ హసీనా అప్పగింతకు భారత్ విముఖత

## రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసేలా బంగ్లాదేశ్ సన్నాహాలు

**మహా :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించాలని భావిస్తోంది. మానవత్వం మరిచి తీవ్ర నేరాలకు పాల్పడ్డారన్న కేసులో షేక్ హసీనాకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆమెను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరుతున్నప్పటికీ భారత్ విముఖత చూపిస్తోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత సంవత్సరం దేశం విడిచిన షేక్ హసీనా, మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌లపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అభ్యర్థించడానికి బంగ్లాదేశ్ ప్రాసిక్యూటర్ గాజీ తమీమ్ సన్నాహాలు చేస్తున్నారని బంగ్లాదేశ్ దినపత్రిక 'ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' నివేదించింది.



# బీజేపీ నాయకులను డీఫేమ్ చేసే కుట్ర

## ఫేక్ న్యూస్‌పై బీజేపీ 'సోషల్ మీడియా వార్' మొదలు పెడతాం
## తప్పుడు ప్రచారం చేస్తే డిఫమేషన్ కేసు తప్పదు
## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బీజేపీ స్టేట్ చీఫ్ రామచంద్ర రావు ఫైర్

**హైదరాబాద్, మహా:** సోషల్ మీడియా వేదికగా బీజేపీ నాయకులను అప్రతిష్టపాలు చేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు తీవ్ర ఆరోపణలు చేశారు. లీగల్ సెల్, సోషల్ మీడియా బృందాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ పెరుగుతున్నందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫేక్ అకౌంట్లు సృష్టించి, తప్పుడు వార్తలతో పార్టీని బ్లేమ్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. పార్టీ నాయకులను డీమోరలైజ్ చేయడానికి కొంతమంది పనిగట్టుకొని ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేస్తున్నారని, ఇకపై సోషల్ మీడియా వార్ మొదలెడతామని ఆయన పిలుపునిచ్చారు. సోషల్ మీడియాను మంచి కార్యక్రమాల కోసం ఉపయోగించాలని, విచ్చలవిడిగా పార్టీలపై దుష్ప్రచారం చేయడానికి కాదని ఆయన కార్యకర్తలకు సూచించారు.

**ఒక పత్రికకు లీగల్ నోటీసులు ఇచ్చాం..**

ఈ సందర్భంగా రామచంద్ర రావు కీలక హెచ్చరిక చేశారు. పార్టీ నాయకులను బ్లేమ్ చేసేవారికి ఏ ఒక్క పార్టీ నేత అయినా మద్దతుగా నిలబడ్డా, ఆ పోస్టులను రీట్వీట్ చేసినా దాన్ని తీవ్రంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. అలాంటి వారిని ఇమ్మీడియెట్‌గా నోటీసులు లేకుండానే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని కరాకండిగా ప్రకటించారు. ఫేక్ ప్రచారం చేసే వారిపై కేసులు పెట్టేందుకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, మాపై తప్పుడు వార్తలు రాస్తే డిఫమేషన్ కేసు వేస్తామని, ఇప్పటికే ఒక పత్రికకు లీగల్ నోటీసులు ఇచ్చామని ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు దమ్ముంటే ఎదురొచ్చి మమ్మల్ని ఎదుర్కోవాలని, డబ్బులు తీసుకొని యూట్యూబ్‌లు నడిపించడం సరికాదని అన్నారు. జిల్లాల్లో మీటింగ్‌లు పెట్టి సోషల్ మీడియా వారియర్స్‌కు ఈ ప్రచారంపై అవగాహన కల్పించాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశించారు.






# సింగరేణి భవన్ ముట్టడి

## కల్వకుంట్ల కవిత అరెస్ట్, నాంపల్లి పోలీసు స్టేషన్ కు తరలింపు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ని ముట్టడించడానికి తెలంగాణ జాగృతి నేతలు ప్రయత్నించారు. దీంతో పోలీసులు కవితతోపాటు పలువురు జాగృతినేతల్ని అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలని, మెడికల్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ సింగరేణి భవన్ ముట్టడికి పిలుపునిచ్చారు కవిత. ఈ క్రమంలో సింగరేణి భవన్ ముట్టడిలో పాల్గొన్న కవిత రోడ్డుపై బైఠాయించారు . సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలంటూ ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. దీంతో కవితను అదుపులోకి తీసుకున్న పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ఆడబిడ్డలందరికీ సారె

## లోపాలు లేకుండా పండుగలా పూర్తి చేయాలి

- ఫేషియల్ రికగ్నిషన్‌తో పంపిణీ.. తూతూమంత్రంగా చేయవద్దు
- మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ షురూ.. మంత్రులు, సీఎం అధికారులతో రివ్యూ

**హైదరాబాద్, మహా:** 'మహిళల ఉన్నతి – తెలంగాణ ప్రగతి' కార్యక్రమం కింద కోటి మంది మహిళలకు 'ఇందిరా మహిళా శక్తి చీరల' పంపిణీ పథకాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీర పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టంచేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆడపడుచులకు సారె, చీర ఇవ్వడం సంప్రదాయమని, ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలందరికీ సారె అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

**ఫేషియల్ రికగ్నిషన్‌తో చీరల పంపిణీ..**

ఈ పథకం అమలు తీరును వివరిస్తూ, అన్ని జిల్లాల్లో మండల కేంద్రాల్లో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ విడతల వారీగా పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక అధికారిని నియమించి కార్యక్రమ బాధ్యతలను అప్పగించాలని, ముందుగానే ప్రజలందరికీ ఈ పథకం గురించి తెలియజేయాలని సూచించారు. చీరల పంపిణీని ఒక పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నది ప్రభుత్వ విధానమని, మున్సిపాలిటీలు, పట్టణాల్లో రెండో విడతలో చీరలు అందిస్తామని, ఏ ఒక్క మహిళకూ చీర అందలేదన్న సమస్య ఉత్పన్నం కావొద్దని స్పష్టం చేశారు. భవిష్యత్తులో చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు ఈ పంపిణీని ప్రామాణికంగా తీసుకునేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. పంపిణీలో పారదర్శకత కోసం కుల గణన సందర్భంగా సేకరించిన డేటాను, ఫేషియల్ రికగ్నిషన్‌తో పాటు ఆధార్ నంబర్ నమోదు చేసుకుని ఎక్కడా తప్పులు జరగకుండా పంపిణీ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

**కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా..**

మహిళా సాధికారతపై ముఖ్యమంత్రి ప్రధానంగా దృష్టి సారించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 27 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు అప్పగించడం వంటి అనేక చర్యల ద్వారా మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తేవాలని, శిల్పారామంలో ఇందిరా శక్తి బజార్ కేటాయించామని, అమెజాన్ ద్వారా ఆన్‌లైన్‌లో



ఉత్పత్తులను విక్రయించుకునే అంశంపై సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. వడ్డీలేని రుణాలు అందించడంలో గతంలో జరిగిన నిర్లక్ష్యాన్ని సరిదిద్దుకుంటూ ప్రభుత్వం ముందుకు పోతోందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి మహిళా సమాఖ్య ప్రతినిధులు చీరల నాణ్యత, రంగు, డిజైన్ బాగున్నాయని ముఖ్యమంత్రితో మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నక్సలైట్లు అడవుల్లో చస్తుంటే అర్బన్ నక్సల్స్ పదవులు అనుభవిస్తున్నారు

## కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, మహా :** దళిత, గిరిజన, ఆదివాసీ అమాయకులను రెచ్చగొట్టి నక్సలైట్లుగా మార్చిన అర్బన్ నక్సలైట్లే వారి చావులకు కూడా బాధ్యత వహించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అమాయక నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే అర్బన్ నక్సలైట్లు మాత్రం ఆస్తులు కూడగట్టుకుని ప్రభుత్వ నామినేటెడ్, కమిషన్ పదవుల్లో కొనసాగుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడటమే తమ సిద్ధాంతమని పదేపదే చెప్పుకునే అర్బన్ నక్సలైట్లు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు పదవుల్లో కొనసాగుతున్నారని ప్రశ్నించారు. హుజురాబాద్ లో మీడియాతో మాట్లాడిన సంజయ్ అధికారంలో ఉన్నా లేకున్నా మావోయిజానికి బీజేపీకి వ్యతిరేకమని స్పష్టం చేశారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం అసాధ్యమని, ప్రజలు హర్షించబోరని చెబుతూ వస్తున్నామని, నేడు అదే నిజమైందన్నారు. అమాయక పిల్లలను రెచ్చగొట్టి వాళ్ల ప్రాణాలను బలిగొనడానికి ప్రధాన కారణం అర్బన్ నక్సల్స్ మాత్రమేనని అన్నారు. ఈరోజు చనిపోయిన కుటుంబాలకు ఏం జవాబు చెబుతారు? పిల్లలు చనిపోతే తల్లిదండ్రుల గుండె ఎంతగా శోకిస్తుందో, భర్త చనిపోతే భార్య, భార్య చనిపోతే భర్త ఎంత దు:ఖానికి గురవుతారో ఈ అర్బన్ నక్సల్స్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. అర్బన్ నక్సలైట్ల విషయంలో గతంలో తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉంటానని, మీడియా, సోషల్ మీడియా ద్వారా రెచ్చగొడుతున్న అర్బన్ నక్సల్స్ అమాయక మావోయిస్టుల చావుకు మీరే బాధ్యత వహించాలన్నారు. ఈ అర్బన్ నక్సల్స్, పౌర హక్కుల సంఘం నాయకులను అడుగుతున్నా పాలకులు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే, ప్రజలకు నష్టం జరిగితే ఉద్యమాలు చేయాలనే సిద్ధాంతం మీది కదా? మరి అట్లాంటప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో, కమిషన్ పోస్టుల్లో ఎట్లా భాగస్వాములు అయ్యారని నిలదీశారు. మహిళలకు నెలకు రూ.2500లు ఇస్తామన్నారు, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామన్నారు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు అనేక హామీలిచ్చారంటూ అవన్నీ ఇచ్చారా అని అడిగారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చనపుడు అర్బన్ నక్సలైట్లు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. అర్బన్ నక్సల్స్ పైరవీలు చేస్తూ, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆస్తులు కూడగట్టుకుంటున్నారని చెప్పిన. అదే మాటకు కట్టుబడి ఉన్నానని అన్నారు. అడవులో అన్నలకు విజ్ఞప్తి చేస్తున్నా అర్బన్ నక్సల్స్ మిమ్ముల్ని రెచ్చగొడుతున్నారు. వాళ్లు ఆస్తులు కూడగడుతూ పదవులు అనుభవిస్తున్నారు. వాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని కోరుతున్నానని అన్నారు. దయచేసి నక్సలైట్లంతా లొంగిపోవాలని కోరారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా సాయం అందిస్తున్నాయి సంతోషంగా జీవించవచ్చన్నారు.



# సత్యసాయి శతజయంతి ఉత్సవాలు





## పుట్టపర్తి ఆధ్యాత్మిక భూమి: ప్రధాని మోదీ

### ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్, సచిన్, ఐశ్వర్యారాయ్ సహా దిగ్గజాల హాజరు

**మహా, ఏపీ బ్యూరో:** ప్రేమ, సేవకు సత్యసాయిబాబా ప్రతిరూపంగా నిలిచారని ప్రధాని మోదీ అన్నారు. పుట్టపర్తి ఆధ్యాత్మిక భూమి అంటూ కొనియాడారు. బాబా జీవితం వసుదైక కుటుంబం అన్నట్లుగానే సాగిందన్నారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో జరిగిన సత్యసాయి శత జయంత్యుత్సవానికి ఆయన హాజరయ్యారు. సాయి కుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహా సమాధిని ప్రధాని దర్శించుకున్నారు. ఆయన వెంట ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియానికి మోదీ చేరుకున్నారు. బాబా జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్, ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్ తదితరులు హాజరయ్యారు. కాగా ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ..మానవ సేవే.. మాధవ సేవ అని సత్యసాయి భావించారని, ఎన్నోకోట్ల మందిని బాబా మార్గదర్శనం చేశారన్నారు. సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బాబా బోధనలు దేశమంతా ప్రభావం చూపించాయంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రేమ, శాంతితో కూడిన వసుదైక కుటుంబ భావన సత్యసాయిదని తెలిపారు. విశ్వ శాంతి, విశ్వసేవను బాబా మనకు చాటి చెప్పారని అన్నారు. మానవ జీవితంలో సేవ చాలా ముఖ్యమని సత్యసాయి చెప్పారని గుర్తుచేశారు. అందరినీ ప్రేమించాలి.. అందరికీ సేవ చేయాలి.. ఇదే బాబా నినాదమని పేర్కొన్నారు. లవ్ ఆల్, సర్వ్ ఆల్ అనేది ఆయన నినాదమని తెలిపారు. సత్యసాయి సందేశం పుస్తకాలు, ప్రవచనాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రతిఒక్కరూ అనుసరించి, ఆచరించి ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.మానవ సేవే మాధవ సేవగా భావించే సత్యసాయిబాబు మనందరికీ స్ఫూర్తి అని తెలిపారు. పేదలకు ఆపదవస్తే ఆదుకోవడంతో బాబా సేవాదళ్ ముందుంటుందని కితాబిచ్చారు. గుజరాత్‌లో భూకంపం సంభవించినపుడు ఆయన సేవాదళ్ సేవలందించిందని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలు దేశ, విదేశాలకు విస్తరించాయని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వికసిత్ భారత్ గా దేశం ముందుకెళ్తోందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. పేదలకు అనేక పథకాలు అందించడంతో పాటు.. గో సంరక్షణ కోసం రాష్ట్రీయ గోకుల్ మిషన్ తీసుకొచ్చామని పేర్కొన్నారు. సత్యసాయిబాబా స్ఫూర్తితో వోకల్ ఫర్ లోకల్ నినాదంతో మనమంతా ముందుకు సాగాలని మోదీ సూచించారు. మన ఉత్పత్తులను మనమే ప్రమోట్ చేసుకోవాలన్నారు.

**బాబాతో అనుబంధం**

అంతకుముందు సత్యసాయి బాబాతో ఉన్న సంబంధాలను ప్రధాని గుర్తు చేసుకున్నారు. గతంలో సత్యసాయి బాబాను కలిసిన దృశ్యాలను మోదీ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. నవంబర్ 19న పుట్టపర్తిలో జరిగే శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్‌లోని నా సోదర సోదరీమణులలో ఒకరిగా ఉండటానికి ఎదురుచూస్తున్నాను. సమాజ సేవ, ఆధ్యాత్మిక మేల్కొలుపు కోసం ఆయన జీవితం, చేసిన ప్రయత్నాలు తరతరాలకు మార్గదర్శకంగా ఉంటాయి. ఆయనతో సంభాషించడానికి, ఆయన నుండి నేర్చుకోవడానికి కొన్ని సంవత్సరాలు నాకు వివిధ అవకాశాలు లభించాయి. మా సంభాషణల నుండి కొన్ని దృశ్యాలు ఇక్కడ ఉన్నాయి అని మోదీ పేర్కొన్నారు.





### ప్రధాని కాళ్ళకు నమస్కరించిన ఐశ్వర్యారాయ్

#### విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి



**మహా:** ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇక ఈ కార్యక్రమానికి మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ సహా అనేక మంది సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదికపై ప్రసంగించిన ఐశ్వర్యరాయ్.. ఆ తర్వాత ప్రధాని మోదీ వద్దకు వచ్చి ఆయన కాళ్లకు నమస్కరించారు. ఇక ఈ కార్యక్రమంలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని పేర్కొన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని.. భౌతికంగా లేకున్నా.. ఆయన ప్రేమ మనతోనే ఉందని తెలిపారు. దేశమంతా సత్యసాయి బోధనల ప్రభావం కనిపిస్తోందని.. కోట్ల మంది సత్యసాయి భక్తులు మానవ సేవచేస్తున్నారని కొనియాడారు. సత్యసాయి జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని మోదీ ఆవిష్కరించారు.

### బాబా మాటలే నాకు స్ఫూర్తి: నారా లోకేశ్




**మహా :** పేదలకు ప్రేమతో సహాయం అందించాలన్న బాబా మాటలే తనకు స్ఫూర్తి అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో మంత్రి మాట్లాడుతూ.. సత్యసాయి సంస్థలు విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా యువ హృదయాల జీవిత లక్ష్యాన్ని సాకారం చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యత, విలువలను పెంపొందించే అభ్యాస సంస్థలుగా ఇవి సేవలందిస్తున్నాయని చెప్పారు. సురక్షిత తాగునీటి ప్రాజెక్టులను పట్టణాలు, గ్రామాలు, మారుమూల గిరిజన ప్రాంతాలకు అనుసంధానించి ప్రజారోగ్యాన్ని సంరక్షిస్తూ వాస్తవ ప్రగతిని సాధిస్తున్నాయని కొనియాడారు. నేటి యువత సాంకేతికత-కరుణ, ఆవిష్కరణ-సానుభూతి కలయికతో కూడిన లక్షణాలు కలిగి ఉండాలని ఆయన సూచించారు. నేర్చుకునే విద్య, ఆరోగ్యం, తాగునీరు, నైపుణ్యం, గ్రామీణాభివృద్ధిలో వాస్తవ సవాళ్లను పరిష్కరించేలా ఉండాలని మంత్రి చెప్పారు. ప్రభుత్వ పాలనలో వివిధ విభాగాలు, వ్యాపారం, సైన్స్, స్టార్టప్ లకు నేడు నైతిక మేధస్సు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.





### సేవ, ప్రేమకు సత్య సాయిబాబా ప్రతిరూపం: సీఎం చంద్రబాబు



సేవ, ప్రేమకు సత్య సాయిబాబా ప్రతిరూపం అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. 1600 గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు అందించారని.. 102 విద్యాలయాలు నెలకొల్పారని కొనియాడారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించి ప్రజలకు సేవ చేశారని వివరించారు. దాదాపు 140 దేశాల్లో 200 కేంద్రాల్లో సత్యసాయి ట్రస్ట్ సేవలందిస్తోందని ప్రశంసలు కురిపించారు. ట్రస్ట్‌కు 7లక్షల మందికి పైగా వాలంటీర్లు ఉన్నారని.. ప్రభుత్వాల కంటే వేగంగా సత్యసాయి స్పందించేవారని చెప్పుకొచ్చారు.





### ఆ పుస్తకం నాలో స్ఫూర్తి నింపింది: సచిన్ టెండుల్కర్



ప్రజల్ని జడ్జ్ చేయొద్దని సత్యసాయి చెప్పారని సచిన్ టెండుల్కర్ అన్నారు. ప్రజలను అర్థం చేసుకోవాలని.. అందువల్ల చాలా సమస్యలు తొలగిపోతాయని వెల్లడించారన్నారు. 2011 వరల్డ్‌కప్‌లో తాను ఆడినప్పుడు భావోద్వేగాలు అధికంగా ఉండేవని చెప్పుకొచ్చారు. అప్పుడు బెంగళూరులో ఉన్నామని.. సత్య సాయిబాబా ఫోన్ కాల్ చేశారని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఒక పుస్తకం పంపారని.. అది తనలో సానుకూల దృక్పథాన్ని, స్ఫూర్తిని నింపిందని తెలిపారు.





# బ్యాటరీలతోనే బ్యాటరీలు తయారీ!

ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల (EV) విప్లవం వేగవంతమవుతున్న నేపథ్యంలో వీటికి శక్తినిచ్చే లిథియంఅయాన్ బ్యాటరీల భవిష్యత్తుపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈవీల ఉత్పత్తి పెరిగే కొద్దీ పనికిరాని బ్యాటరీల సంఖ్య కూడా భారీగా పేరుకుపోతుంది. భవిష్యత్తులో ఈ సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది. వీటిని సరైన రీతిలో నిర్వహించకపోతే పర్యావరణానికి పెనుముప్పు తప్పదు. అయితే, ఈ బ్యాటరీల నిర్వహణనే ఒక భారీ ఆర్థిక అవకాశంగా కొన్ని కంపెనీలు మలుచుకుంటున్నాయి. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం.. త్వరలోనే ఈవీ బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ వేల కోట్ల డాలర్ల వ్యాపారంగా అవతరించనుంది.

**పెరుగుతున్న బ్యాటరీల వాడకం**

ఎలక్ట్రిక్ వాహనాల్లో బ్యాటరీలే ప్రధానం. ఇంధన ధరల పెరుగుదల, కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాల నేపథ్యంలో అన్ని దేశాలూ ఈవీల తయారీని ప్రోత్సహిస్తున్నాయి. ఫలితంగా అధిక శక్తి సాంద్రత, ఎక్కువ శ్రేణి(Range)ని అందించే అధునాతన లిథియంఅయాన్ బ్యాటరీలకు డిమాండ్ పెరుగుతోంది. కంపెనీలు నిరంతరం కొత్త రసాయన ఫార్ములాలు ఉపయోగిస్తూ బ్యాటరీల సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. అయితే వాహనం జీవితకాలం ముగిసిన తర్వాత లేదా బ్యాటరీ సామర్థ్యం తగ్గిన తర్వాత దాన్ని ఎలా నిర్వహించాలనే ప్రశ్నలు మొదలవుతున్నాయి. ప్రస్తుతానికి పాత బ్యాటరీల నిర్వహణ గందరగోళంగా ఉంది.

**బ్యాటరీల రీసైక్లింగ్**

ఈవీ బ్యాటరీలను పర్యావరణ హితంగా రీసైకిల్ చేయడం సంక్లిష్ట ప్రక్రియ. వీటిలో విలువైన లోహాలు (కోబాల్ట్, నికెల్, లిథియం, మాంగనీస్) ఉంటాయి. ఈ లోహాలను తిరిగి వెలికి తీయడం రీసైక్లింగ్ ప్రధాన లక్ష్యం. అందుకు రెండు పద్ధతులను ఉపయోగిస్తున్నారు.

**హైడ్రోమెటలర్జీ**

ఇది అత్యంత ప్రజాదరణ పొందిన పద్ధతి. ముందుగా బ్యాటరీలను సురక్షితంగా విడిభాగాలుగా చేసి, పొడిగా చేస్తారు. తర్వాత శక్తివంతమైన రసాయన ద్రావణాలను (యాసిడ్స్) ఉపయోగించి చూర్ణం పొడి పదార్థాన్ని కరిగిస్తారు. ఈ ద్రావణం నుంచి లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి విలువైన లోహాలను వేరుచేసి, శుద్ధి చేస్తారు. దీనివల్ల అధిక స్వచ్ఛత కలిగిన పదార్థాలను తిరిగి పొందవచ్చు.



**పైరోమెటలర్జీ**

ఈ ప్రక్రియను స్మెల్టింగ్ అని కూడా అంటారు. ఇందులో బ్యాటరీ భాగాలను నేరుగా అధిక ఉష్ణోగ్రతల వద్ద (సుమారు 1500 డిగ్రీ సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ) కాల్చివేస్తారు. ఈ ప్రక్రియలో ప్లాస్టిక్, కార్బన్ వంటి పదార్థాలు కాలిపోతాయి. విలువైన లోహాలు ద్రవ రూపంలోకి మారి లోహ మిశ్రమం (Alloy)గా ఏర్పడతాయి. ఈ మిశ్రమం నుంచి కోబాల్ట్, నికెల్‌లను తిరిగి పొందుతారు. ఇందులో బ్యాటరీలను పూర్తిగా విడదీయాల్సిన అవసరం తక్కువగా ఉంటుంది. అయితే ఈ ప్రక్రియలో అధిక ఉష్ణోగ్రతలు వెలువడడంతో లిథియంను తిరిగి పొందడం కష్టమవుతుంది. పైన తెలిపిన పద్ధతులతో పాటు కేవలం లోహాలను భౌతికంగా వేరుచేసే డైరెక్ట్ రీసైక్లింగ్ వంటి నూతన పద్ధతులపై కూడా పరిశోధనలు జరుగుతున్నాయి.

**రీసైకిల్ చేయకపోతే కలిగే నష్టాలు**

పనితీరు తగ్గిపోయిన ఈవీ బ్యాటరీలను రీసైకిల్ చేయకుండా పారవేయడం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుంది. బ్యాటరీలలో ఉండే భారీ లోహాలు, విషపూరిత రసాయనాలు (ఉదా: లిథియం లవణాలు, ఎలక్ట్రోలైట్స్) భూమిలోకి, జల వనరులలోకి చేరి నీటిని, నేలను కలుషితం చేస్తాయి. పాత బ్యాటరీలను కాల్చివేసినా లేదా అవి శిథిలమైనా ప్రమాదకరమైన వాయువులు వాతావరణంలోకి విడుదలవుతాయి. లిథియంఅయాన్ బ్యాటరీలు అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. పారవేసిన ప్రదేశాల్లో ఇవి మండే ప్రమాదం ఉంది. రీసైకిల్ చేయకపోతే బ్యాటరీల్లోని కోబాల్ట్, నికెల్, లిథియం వంటి కీలకమైన ఖనిజ వనరులు శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది. దీనివల్ల కొత్త బ్యాటరీల తయారీకి కేవలం మైనింగ్ మీదే ఆధారపడాల్సి వస్తుంది.

### రీసైక్లింగ్ వల్ల లాభాలు

బ్యాటరీ రీసైక్లింగ్ కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు, ఆర్థికంగా పరిశ్రమకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. లిథియం, కోబాల్ట్ వంటి లోహాల నిల్వలు ప్రపంచంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉన్నాయి. రీసైక్లింగ్ ద్వారా ఈ విలువైన ముడిసరుకును దేశీయంగా తిరిగి పొందవచ్చు. ఇది సరఫరా గొలుసుపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. మైనింగ్, శుద్ధి ప్రక్రియలతో పోలిస్తే రీసైక్లింగ్ ద్వారా లోహాలను పొందడం దీర్ఘకాలంలో చౌకైన పద్ధతిగా మారే అవకాశం ఉంది. ఉదాహరణకు, రీసైకిల్ చేసిన కోబాల్ట్ కొత్తగా తవ్విన కోబాల్ట్ కంటే సుమారు 25% తక్కువ ఖర్చుతో లభించవచ్చని అంచనా. బ్యాటరీ రీసైక్లింగ్ అనేది కొత్త పరిశ్రమ. దీని నిర్వహణ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో వేలాది కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి.

## చాట్‌జీపీటీ డౌన్ అయితే పరిస్థితేంటి?

ఇంటర్నెట్ మౌలిక సదుపాయాల్లో కీలక పాత్ర పోషించే క్లౌడ్‌ఫ్లేర్‌లో ఇటీవల తలెత్తిన సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా వెబ్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విస్తృతంగా అంతర్గత సర్వర్ లోపాలు ఏర్పడటానికి ఇది దారితీసింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రధాన ప్లాట్‌ఫామ్‌ల సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. యూఎస్, యూరప్, ఆసియాలో ఈ అంతరాయం ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఈ అంతరాయం కారణంగా X (గతంలో ట్విట్టర్), స్పాటిఫై.. వంటి కీలక సేవలతో పాటు OpenAI ChatGPT సేవలు కూడా కొద్ది సమయం నిలిచిపోయాయి. క్లౌడ్‌ఫ్లేర్ సమస్య కారణంగా ChatGPTని సందర్శించిన వినియోగదారులకు 'దయచేసి ముందుకు సాగడానికి challenges.cloudflare.com అన్‌బ్లాక్ చేయండి' అనే సందేశం దర్శనమిచ్చింది. ఈ నేపథ్యంలో జనరేటివ్ ఏఐలో కీలకంగా వ్యవహరిస్తున్న చాట్‌జీపీటీ (క్లౌడ్‌ఫ్లెయిర్ ఇన్‌ఫ్రా వాడుతుంది)




సర్వీసులు మధ్యంతరంగా నిలిచిపోతే పనులు సజావుగా సాగేందుకు ప్రత్యామ్నాయాలు చూద్దాం.

**గూగుల్ జెమిని**

గూగుల్ జెమిని అధునాతన మోడల్స్‌తో రూపొందించారు. గూగుల్ సెర్చ్‌కు రియల్ టైమ్ కనెక్షన్ కలిగి ఉంది. దీని కారణంగా ఇది ఎల్లప్పుడూ అప్‌డేటెడ్, రియల్‌టైమ్ సమాచారాన్ని అందిస్తుంది. అంతేకాకుండా ఇది జీమెయిల్, డాక్స్, డ్రైవ్ వంటి గూగుల్ ఎకోసిస్టమ్‌తో అనుసంధానం కలిగి ఉంటుంది.

**ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐ**

క్లాడ్ ఏఐ సెక్యూరిటీ, కచ్చితత్వం, నైతిక ఏఐ మోడల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. ఇది long context documents నిర్వహించగల సామర్థ్యం కలిగి ఉంది.

**మైక్రోసాఫ్ట్ కోపైలట్**


మైక్రోసాఫ్ట్ కోపైలట్ అంతర్లీనంగా చాట్‌జీపీటీలాగే అదే జనరేటివ్ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుంది. ఇది మైక్రోసాఫ్ట్ 365 ఎకోసిస్టమ్‌లో(Word, Excel, PowerPoint, Outlook) ఇంటర్నల్‌గా ఉండే ఏఐ అసిస్టెంట్. మైక్రోసాఫ్ట్ వర్క్‌ఫ్లోలో ఉన్నవారు కార్పొరేట్ పత్రాలను రూపొందించడానికి, డేటాను విశ్లేషించడానికి ఇది అనువైనది.

**జాస్పర్ ఏఐ**

జాస్పర్ ఏఐ ప్రొఫెషనల్ కంటెంట్ రూపొందించడంలో ప్రత్యేకత కలిగి ఉంది. ఇది బ్లాగ్‌లు, కథనాలు, సోషల్ మీడియా పోస్ట్‌లు, మార్కెటింగ్ కాపీలు అందిస్తుంది. మార్కెటర్లు, బ్లాగర్లు, కంటెంట్ క్రియేటర్లకు ఇది తోడ్పడుతుంది.

## ఇన్ఫోసిస్ బైబ్యాక్.. షేరుకి రూ. 1800

సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కి తెరతీస్తోంది. ఈ నెల 26న ముగియనున్న బైబ్యాక్‌లో భాగంగా షేరుకి రూ. 1,800 ధర మించకుండా చెల్లించనుంది. ఇందుకు రూ. 18,000 కోట్లవరకూ వెచ్చించనుంది. దీనిలో భాగంగా రూ. 5 ముఖ విలువగల 10 కోట్ల షేర్లను బైబ్యాక్ చేసే లక్ష్యంతో ఉంది. ఇది కంపెనీ ఈక్విటీలో 2.41 శాతం వాటాకు సమానంకాగా.. అర్హతగల వాటాదారులు నవంబర్ 20-26 మధ్య కాలంలో షేర్లను విక్రయించేందుకు(టెండర్) వీలుంటుంది. మధ్యకాలానికి కంపెనీ నిర్వహణ సంబంధ నగదు అవసరాలను పరిగణించాక మిగులు నిధులను వాటాదారులకు పంచే యోచనతో బైబ్యాక్‌కు ఉపక్రమించింది. కంపెనీ మూలధన కేటాయింపుల విధానం ప్రకారం బైబ్యాక్‌ను రెండు విభాగాలుగా చేపడుతున్నట్లు ఇన్ఫోసిస్ తెలియజేసింది. సాధారణ కేటగిరీతోపాటు.. చిన్న వాటాదారులకు రిజర్వ్‌డ్ విభాగాన్ని సైతం ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.




రిజర్వేషన్ విభాగంలో వాటాదారుల ఈక్విటీ షేర్ల సంఖ్యలో 15 శాతం లేదా ఇందుకు అర్హమైన ఈక్విటీ షేర్ల సంఖ్యలో ఏది ఎక్కువైతే దానిని పరిగణిస్తుంది. ఈ నెల 14కల్లా వాటాదారులుగా నమోదై రూ. 2 లక్షల విలువకు మించకుండా షేర్లు కలిగిన వాటాదారులకు ఇది వర్తించనుంది. చిన్న ఇన్వెస్టర్లకు 2:11, సాధారణ కేటగిరీలో 17:706 నిష్పత్తిని షేర్ల బైబ్యాక్‌కు నిర్ణయించింది. ఇన్ఫోసిస్‌లో 25,85,684 మంది చిన్న ఇన్వెస్టర్లున్నారు. అంటే రిటైల్ ఇన్వెస్టర్ల వద్ద గల ప్రతీ 11 షేర్లలో 2 షేర్లకు బైబ్యాక్‌ను ఆఫర్ చేస్తుంది. ఇన్ఫోసిస్ గతంలో తొలిసారి 2017లో రూ. 13,000 కోట్లతో ఈక్విటీ షేర్ల బైబ్యాక్‌ను చేపట్టింది. కంపెనీ ఈక్విటీలో 4.92 శాతం వాటాకు సమానమైన 11.3 కోట్ల షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు షేరుకి రూ. 1,150 ధరను నిర్ణయించింది. తదుపరి 2019లో రూ. 8,260 కోట్లు ఇందుకు వెచ్చించింది. ఈ బాటలో మూడోసారి రూ. 9,200 కోట్లు, 2022లో మరోసారి షేరుకి రూ. 1,850 చొప్పున రూ. 9,300 కోట్లు చొప్పున బైబ్యాక్‌కు కేటాయించింది. కాగా.. ప్రస్తుత బై బ్యాక్‌లో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ పాల్గొనబోమని ఇప్పటికే ప్రకటించారు. ప్రమోటర్లలో నందన్ నిలేకని, సుధా మూర్తిసహా ఇతర ప్రమోటర్ కుటుంబీకులు ఇందుకు నో చెప్పడం గమనార్హం!

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## సబ్మరతి జైల్లో హైదరాబాద్ ఉగ్రవాది అహ్మద్‌పై దాడి.. ఆస్పత్రికి తరలింపు

గుజరాత్‌లో ఉగ్ర కుట్రకు సూత్రధారి, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌పై దాడి జరిగింది. ప్రస్తుతం అహ్మదాబాద్ శివారులోని సబర్మతి జైలులో ఉన్న అతడిపై తోటి ఖైదీలు దాడి చేసి చితకబాదారు. ఈ దాడిలో అతని ముఖానికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. జోన్ 2 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెల్లడించిన వివరాల ప్రకారం.. అహ్మద్ సయ్యద్‌ను జైల్లోని హైసెక్యూరిటీ సెల్‌లో ఉంచారు. అయితే ఈ కేసులో తనతో పాటే అరెస్టైన అజాద్, సుహాయిల్‌తో సయ్యద్ వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న మరో ముగ్గురు ఖైదీలు అనిల్ కుమార్, శివమ్ శర్మ, అంకిత్ లోడీ జోక్యం చేసుకుని సయ్యద్‌పై ఓ కర్రతో దాడికి దిగారు. ఈ దాడిలో సయ్యద్ ముఖానికి గాయాలు కావడంతో చికిత్స కోసం దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే గుజరాత్ యాంటీటెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)కు చెందిన ఓ బృందం సబర్మతి జైలుకు చేరుకుంది. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి.. దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుంది. దాడికి పాల్పడిన ఖైదీలు ఒకరు హత్య కేసులో నిందితుడు కాగా.. మరొకరు ఆర్థిక నేరంలో, ఇంకొకరు పోక్సో కేసులో శిక్ష అనుభవిస్తున్నారు అసలు దాడి ఎందుకు జరిగిందనే అంశంపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల అనగా నవంబర్ 8న, గుజరాత్ యాంటీటెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) ముగ్గురు ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరిలో హైదరాబాద్ నగరానికి చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. మొహియుద్దీన్.. ఐసీస్‌కు చెందిన ఓ డిపార్ట్‌మెంట్ అయిన.. ఇస్లామిక్ స్టేట్ ఖోరాసన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ)కు చెందిన ఉగ్రవాదిగా దాదాపు నిర్ధారణ అయ్యింది. ఆముదం గింజల నుంచి విషం తయారు చేసి.. దాన్ని ప్రసాదంలో కలిపి.. అమాయకుల ప్రాణాలు తీయాలని భావించిన మొహియుద్దీన్ స్కెచ్ గీశాడు. చైనాలో ఎంబీబీఎస్ చదవిన మొహియుద్దీన్.. అబుల్ ఖాదీమ్ ఆదేశాల మేరకు ఆముదం




గింజల నుంచి ప్రమాదకరమైన రైసిన్ అనే ప్రమాదకరమైన విషాన్ని తయారు చేయడానికి ఇంట్లోనే అన్ని పరికరాలు ఏర్పాటు చేసుకున్నాడు. అహ్మదాబాద్ ఏటీఎస్ అహ్మద్‌తో పాటు అరెస్టైన మరో ఇద్దరిని విచారించింది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మొహియుద్దీన్.. మరో ఉగ్రవాది అబూ ఖాదీమ్ ఆదేశాల మేరకు పని చేస్తుంటాడని విచారణలో తెలిసింది. అబూ ఖాదీమ్ పాక్-అఫ్గాన్ సరిహద్దుల్లో ఉండి ఈ మాడ్యూల్‌ను నడిపిస్తున్నాడని.. దర్యాప్తులో వెల్లడైంది.



## పిల్లల్ని గ్యాస్ చాంబర్‌లో పెట్టినట్లే అవుతోంది

ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ రాజధానిలో పెరుగుతున్న కాలుష్యంపై సీజేఐ ధర్మాసనం బుధవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కాలుష్యం నడుమ స్కూల్ పిల్లలను గ్యాస్ చాంబర్‌లో పెట్టినట్లే అవుతోందని.. కాబట్టి ఇలాంటి సమయంలో క్రీడా కార్యక్రమాలను నిర్వహించడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని వ్యాఖ్యానించింది. దేశ రాజధానిలో కాలుష్యం రోజురోజుకి పెరిగిపోతోంది. పాఠశాల పిల్లలను గ్యాస్ చాంబర్‌లో పెట్టినట్లే అవుతోంది. కాలుష్యం ఎక్కువగా ఉన్న ఈ సమయంలో స్పోర్ట్స్ ఈవెంట్ల పెట్టొద్దు. క్రీడా కార్యక్రమాలను కాలుష్యం లేని ప్రాంతాల్లో నిర్వహించాలి. నవంబర్‌డిసెంబర్ నెలల్లో నిర్వహించాల్సిన స్పోర్ట్స్ ఈవెంట్లు వాయిదా వేయించండి అని పేర్కొంది. ఈ మేరకు ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో స్కూళ్లలో స్పోర్ట్స్ ఈవెంట్లను వాయిదా వేయించాలని, గాలి నాణ్యత మెరుగయ్యాకే వాటిని నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కి చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

## కశ్మీరీలందరనీ అనుమానిస్తున్నారు.. ఒమర్

జమ్మూకశ్మీర్‌కు చెందిన కొంతమంది వ్యక్తులు చేసిన పనికి ప్రాంతం మొత్తాన్ని నిందిస్తున్నారని అక్కడి సీఎం ఒమర్ అబ్దుల్లా అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో జమ్మూకశ్మీర్ ప్రజలు ఎక్కడా ఉండే విధంగా లేదని ఎక్కడి కెళ్లినా వారిని అనుమానంగా చూస్తున్నారని అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎర్రకోట కారుబాంబు దాడిలో జమ్మూకశ్మీర్ ప్రాంతానికి చెందిన వ్యక్తులను ప్రధాన నిందితులుగా ఎన్‌ఐఏ గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు." ఢిల్లీ బాంబ్ బ్లాస్ట్ ఘటనకు కొంతమంది బాధ్యులు. కాని పరిస్థితులు చూస్తుంటే ఈ ప్రాంతంలోని వ్యక్తులంతా కారణం అన్నట్లున్నాయి. జమ్మూకశ్మీర్ రిజిస్ట్రేషన్ వెహికల్ ఢిల్లీలో తిరగడం నేరం అన్నట్లు చూస్తున్నారు. నేను ఆ ప్రాంతంలో తిరిగినా ఎవరూ నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావు అనేలా పరిస్థితులు కన్పిస్తున్నాయి" అని ఆయన అన్నారు. 2019లో జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించినప్పుడు అంతా ఆగిపోతుందని కేంద్రం చెప్పింది కానీ ఏమీ ఆగలేదు. ఒకవేళ ఢిల్లీలో బాంబుబ్లాస్ట్ జరిగి ఉండక పోతే తమ దగ్గర జరిగేదని జమ్మూ ఎంతో హింసను చూసిందని బాంబుల దాడులతో జమ్మూ



ప్రజలు మరణించడం ఇంకా ఆగలేదని ఒమర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులెవరూ పిల్లలను తమ ప్రాంతం వదిలి బయిటకు పంపించేలా లేరని ఒమర్ తెలిపారు. కాగా ఎర్రకోట బాంబుదాడి ఘటనపై ఆయన తండ్రి ఫరూక్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. డాక్టర్లు ఈ మార్గం ఎందుకు ఎన్నుకున్నారు. దానికి కారణం ఏమిటి? దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన అన్నారు.

## భారత్‌లో మరోసారి ఆత్మాహుతి దాడికి జైషే కుట్ర



**ఢిల్లీ:** ఎర్రకోట బాంబు తరహాలో భారత్‌లో మరోసారి ఆత్మాహుతి దాడికి నిషేధిత ఉగ్రవాద సంస్థ జైష్ మహమ్మద్ ప్రయత్నిస్తుందని ఎన్‌ఐఏ వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా ఆదాడి కోసం పాకిస్థాన్‌లో విరాళాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఎర్రకోట బాంబు పేలుళ్లపై ఎన్‌ఐఏ జరుపుతున్న దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. జైష్ ఉగ్ర సంస్థ ఎర్రకోట కారు బాంబు తరహాలో భారత్‌లో మరో ఆత్మాహుతి దాడి (ఫిదాయిన్)కు ప్రణాళికలు రచించిందని తెలుస్తోంది. అంతే కాకుండా ఆ దాడికోసం డిజిటల్ మార్గాల ద్వారా విరాళాలు సేకరిస్తుందని అందులో సదాపే అనే పాకిస్థాన్‌కు చెందిన యాప్ కూడా ఉందని తెలిపింది. ఫండ్ రుసుము పాకిస్థాన్ కరెన్సీలో 20వేలు భారత్(రూ.6400) ఉన్నట్లు పేర్కొంది. ఈ డబ్బులను ఉగ్రవాదుల ఖర్చులకోసం ఉపయోగిస్తున్నట్లు సమాచారం. వీటితో పాటు ఉగ్రవాదులకు చలికాలపు కిట్ ముజాహిద్ ఇచ్చే వారినెవరినైనా జిహాదీలుగా పరిగణిస్తారని జిహాదీల మరణానంతరం వారిపై శ్రద్ధ కనిపించేవారిని సైతం జిహాదీలుగానే గుర్తిస్తున్నట్లు దర్యాప్తులో వివరాలు తెలిసాయి. ఇటీవల ఎర్రకోటలో జరిగిన బాంబు దాడులలో టెర్రర్ డాక్టర్ గ్రూప్‌కు డిజిటల్ మార్గంలోనే నిధులు అంది ఉండవచ్చని దానిపై ప్రత్యేక దర్యాప్తు చేపడుతున్నామని ఎన్‌ఐఏ బృందాలు పేర్కొన్నాయి. కాగా ఇటీవల ఫరీదాబాద్ అక్రమ పేలుడు పదార్థాల కేసులో అరెస్టయిన డాక్టర్. షహీన్ సయీద్ ఈ దాడికి ఫండ్ చేసిందని ఎన్‌ఐఏ బృందాలు అనుమానిస్తున్నాయి. ఈ బాంబు పేలుళ్ల కేసులో షహీన్ సయీద్‌ను మేడమ్ సర్జన్ అనే కోడ్ నేమ్ కలిగి ఉంది. జమాత్ ఉల్ మురినాత్ అనే యూనిట్‌లో ఆమె సభ్యురాలిగా ఉన్నట్లు సమాచారం.

## ఇన్వెస్టర్ల క్యూ... కొత్త ఐటీ నగరం వచ్చేస్తోంది!

కర్ణాటకలో మరో కొత్త ఐటీ నగరం రూపుదిద్దుకోబోతోంది. బిడది (Bidadi)లో కొత్త ఐటీ నగరాన్ని నిర్మించ నున్నామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకె శివకుమార్ (DK Shivakumar) చెప్పారు. అనేక దేశాల నాయకులు ఇటీవల బెంగళూరు సందర్శించారని, భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడానికి ఉత్సాహంగా డిప్యూటీ సీఎం ఉన్నారని చెప్పారు. బెంగళూరు టెక్ సమ్మిట్ 2025 సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగళూరుమైసూరు ఎక్స్‌ప్రెస్‌వేలో ఉన్న బిడదిలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఐటీ నగరాన్ని ప్లాన్ చేస్తోందని డీకే ప్రకటించారు. గ్రేటర్ బెంగళూరు ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ (GBIT) ప్రాజెక్ట్ అంతర్జాతీయ వ్యాపారవేత్తలను ఆకర్షిస్తోందని, గణనీయమైన పెట్టుబడులకు ఆసక్తిని వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. ఈ పెట్టుబడులను తాము స్వాగతిస్తున్నట్టు చెప్పారు. 60 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమ్మిట్ మూడు రోజుల పాటు ఐటీ భవిష్యత్తుపై చర్చిస్తుందన్నారు. కర్ణాటకలోని నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి ,అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ యొక్క బలాలను నొక్కిచెప్పారు. "స్థానిక ప్రతిభ, ఆవిష్కరణ, సాంకేతికత మరియు స్టార్టప్‌లను సరిగ్గా ప్రోత్సహిస్తే కర్ణాటకను కొత్త దిశలో తీసు కెళతాయన్నారు. ప్రపంచ స్థాయిలో పోటీ పడాలని తానెపుడూ యువను కోరుతూ ఉంటానన్నారు. అలాగే అవకాశాలను కోరుతూ కర్ణాటకకు వచ్చే వారికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే , కియోనిక్స్ అధిపతి శరత్ బచ్చే గౌడల కృషిని ఆయన ప్రశంసించారు, బెంగళూరు నగరాన్ని ఈ రంగంలో అగ్రగామిగా మార్చడానికి నగర 25 లక్షల ఐటీ నిపుణుల సహకారాన్ని ఆయన కొనియాడారు. ప్రపంచంలో ఇంతటి ప్రతిభ మరెక్కడా లేదని పేర్కొన్నారు శివకుమార్.



# నాకు లవ్‌స్టోరీ సినిమాలంటే పిచ్చి ఇష్టం: నాగచైతన్య




''ఒక నటుడిగా, ప్రేక్షకుడిగా నాకు లవ్‌స్టోరీ సినిమాలంటే పిచ్చి ఇష్టం. కోవిడ్ తర్వాత అందరూ యాక్షన్ , సినిమాటిక్ యూనివర్స్, కొత్త వరల్డ్ నేపథ్యంలో వచ్చే సినిమాలకే ప్రేక్షకుల ఆదరణ ఉంటుందని చెప్పారు. కానీ ప్రేమకథలు థియేటర్స్‌లోకి వస్తే, విజయాలు సాధిస్తాయని ఇటీవల మరోసారి ప్రూవ్ అయ్యింది. లవ్‌స్టోరీస్ టైమ్‌లెస్'' అని చెప్పారు నాగచైతన్య. ప్రియదర్శి, ఆనంది జంటగా, సుమ కనకాల కీలక పాత్రలో నటించిన చిత్రం 'ప్రేమంటే..'. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో రానా సమర్పణలో పుస్కూర్ రామ్మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నాగచైతన్య, దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా హాజరై, బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. తొలి టికెట్‌ను రూ.లక్షా పదహారు వేల నూటపదహార్లకు కడివేలు సాయి కొనుగోలు చేశారు. నాగచైతన్య మాట్లాడుతూ– ''ఇండస్ట్రీలో ఉన్న విలక్షణ నటుల్లో ప్రియదర్శి ఒకరు. స్మాల్, బిగ్ బడ్జెట్ చిత్రాలు.. హారర్, కామెడీ, యాక్షన్ , లీడ్ యాక్టర్, హీరో... ఇలా తను ఒక మంచి కెరీర్‌ను బిల్డ్ చేసుకున్నాడు. నవనీత్ ఓ ఫ్రెష్ లవ్‌స్టోరీతో ఆడియన్స్ ముందుకు వస్తున్నందుకు హ్యాపీగా ఉంది. సుమగారు యాక్ట్ చేయడం ఓ సర్‌ప్రైజ్. ఈ టీమ్ అందరికీ శుభాకాంక్షలు'' అని చెప్పారు. ''ప్రియదర్శి మంచి సినిమాలు చేస్తూ వస్తున్నాడు. నవనీత్ టెన్షన్ లేకుండా కనిపిస్తున్నాడు. సినిమా బాగా వచ్చిందనుకుంటున్నాను. చిన్న సినిమాలు బాగా ఆడుతున్న టైమ్ ఇది. ఈ యంగ్ టీమ్ చేసిన ఈ చిత్రం సక్సెస్ సాధిస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు శేఖర్ కమ్ముల. ''ఏషియన్స్ ప్రొడక్షన్స్ హౌస్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థలో నేను సినిమా చేసే అవకాశాన్ని ఫ్యాన్స్ ప్రేమ వల్లే పొందగలిగాను'' అన్నారు ప్రియదర్శి. ''పెళ్లయిన తర్వాత ఎంత కొట్లాడుకున్నా, ఎంత అరుచుకున్నా, ఒక చాయ్ తాగుతూ మాట్లాడుకుని ఎలా సాల్వ్ చేసుకోవచ్చు' అన్నదే ఈ సినిమా కథ'' అని తెలిలిపారు నవనీత్. తెలుగు పరిశ్రమ లోనివారిపై సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నవారిని హైపర్ ఆది విమర్శించారు. నిర్మాతలు సురేష్‌బాబు, జాన్వీ నారంగ్ మాట్లాడారు.

# హీరో, దర్శకుడితో సాయిపల్లవి మళ్లీ?

ఇండస్ట్రీలో ఏ సినిమాలోనైనా సాయిపల్లవి హీరోయిన్‌గా చేస్తే ఆ సినిమా గ్యారెంటీ హిట్టే అన్నంతగా టాక్ ఉంది. తమిళంలో ఈమె నటించిన 'అమరన్' గతేడాది రిలీజై అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రత్యేకించి సాయిపల్లవి నటనకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాంటి ఈమె.. ప్రస్తుతం హిందీలో తీస్తున్న 'రామాయణ' అనే భారీ పాన్ ఇండియా మూవీలో సీతగా చేస్తోంది. దీంతో ఇప్పటికైతే దక్షిణాదిలో కొత్తగా మూవీస్ ఏం చేయట్లేదు. కానీ త్వరలో తమిళంలో కమ్ బ్యాక్ ఇవ్వనుందనే టాక్ వినిపిస్తుంది. సాయిపల్లవి గతంలో ధనుష్‌కు జోడీగా 'మారి 2' అనే సినిమా చేసింది. బాక్సాఫీస్ దగ్గర ఇదే యావరేజ్ అనిపించింది. ఈ హీరో ప్రస్తుతం 'అమరన్' దర్శకుడు తీస్తున్న కొత్త మూవీలో నటిస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇందులో హీరోయిన్‌గా మీనాక్షిచౌదరి, పూజాహెగ్డే పేర్లు పరిశీలించారు. కానీ ఇప్పుడు ఫైనల్‌గా సాయిపల్లవి అని ఫిక్సయ్యారట. ఈ మేరకు చర్చలు సాగుతున్నాయి ప్రస్తుతం ధనుష్ 'పోర్ తొళిల్' సినిమా ఫేమ్ విఘ్నేష్ రాజా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. ఇది త్వరలో పూర్తవుతుంది. ఇంతలో తర్వాత మూవీలో సాయిపల్లవి నటిస్తుందా లేదా అనే విషయంపై క్లారిటీ వచ్చే అవకాశముంది. త్వరలో దీని గురించి అధికారిక ప్రకటన రావొచ్చు.



# డబ్బు చాయిస్ కాదు..



బాలీవుడ్‌లో ఉన్న టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది దీపికాపదుకొనే. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో వన్ ఆఫ్ ది లీడింగ్ నటీమణుల్లో ఒకరిగా కొనసాగుతున్న ఈ భామ ప్రస్తుతం అల్లు అర్జున్, అట్లీ కాంబోలో వస్తోన్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ AA22xA6లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ బ్యూటీ ఇప్పటికే ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీలో కీలక పాత్ర పోషించిందని తెలిసిందే. అయితే కల్కి సీక్వెల్‌లో కూడా దీపికాపదుకొనే నటించాల్సి ఉండగా.. ఈ సినిమా చేసేందుకు నో చెప్పింది. అంతేకాదు సందీప్ రెడ్డి వంగా, ప్రభాస్ కాంబోలో రానున్న స్పిరిట్‌లో కూడా దీపికాపదుకొనే పేరు ప్రముఖంగా వినిపించగా.. ఈ చిత్రాన్ని కూడా తిరస్కరించిందని వార్తలు వచ్చాయి. అయితే ఈ రెండు భారీ బడ్జెట్ చిత్రాలే. మరి ఈ సినిమాలను తిరస్కరించడంపై దీపికాపదుకొనే క్లారిటీ ఇచ్చింది. తన నిర్ణయం పట్ల వస్తున్న నెగెటివ్ కామెంట్స్‌పై తాజాగా ఓ ఇంటర్వ్యూలో దీపికాపదుకొనే స్పందించింది. స్పిరిట్, కల్కి 2 సినిమాల నుంచి తప్పుకోవడానికి రెమ్యునరేషనో లేదంటే షెడ్యూలో కారణం కాదంది. అది రూ.100 కోట్ల సినిమానా..? రూ.500600 కోట్ల సినిమానా అనేది కానే కాదంది దీపికాపదుకొనే. సినిమా (స్థాయి) రేంజ్ తన చాయిస్‌లపై ప్రభావం చూపించబోదని చెప్పకనే చెప్పింది దీపికాపదుకొనే. కొన్నిసార్లు కొందరు పెద్ద మొత్తంలో రెమ్యునరేషన్ ఆఫర్ చేస్తారు. అది చాలు అనుకుంటారు. కానీ అది కాదని చెప్పింది. ఆరోగ్యకరమైన పని వాతారణం ఉండాలని.. ప్రతీ రోజు ఎనిమిది గంటలు పనివేళలు సరిపోతాయంది. మీరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉత్తమంగా పనిచేస్తారని చెప్పుకొచ్చింది దీపికాపదుకొనే. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# అవమానించారు



తమిళ హీరోయిన్‌కి టాలీవుడ్‌లో దారుణమైన అవమానం జరిగింది. ఈ విషయాన్ని సదరు హీరోయిన్ బయటపెట్టింది. డైరెక్టర్ తనని షూటింగ్ జరుగుతున్నప్పుడు చాలా అవమానించాడని, ఈ మొత్తం వ్యవహారంలో హీరో (సుడిగాలి సుధీర్) సైలెంట్‌గా ఉండటం చాలా బాధించిందని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. 'మహిళలని చిలక లేదా మరేదైనా పదంతో పిలవడం జోక్ ఏం కాదు. ఇది ఆడవాళ్లపై నీకెంత ద్వేషముందో చెబుతోంది. ఇదొక్కటే కాదు సెట్‌లోనూ ఇతడు ఇలానే ప్రవర్తించేవాడు. పదేపదే మహిళల్ని కించపరుస్తూ తన కళకే ద్రోహం చేశాడు. ఈ మొత్తం వ్యవహారంలో హీరో మౌనంగా ఉండటం చూసి నేను చాలా బాధపడ్డాను. దీనివల్ల దర్శకుడికి చనువిచ్చినట్లు అయింది' అని దివ్య భారతి తన ఆవేదన వ్యక్తం చేసింది. మరో ట్వీట్‌లో తమిళ, తెలుగు చిత్రసీమ గురించి తేడాలు చెప్పుకొచ్చింది. 'నాతో ఎప్పుడూ సమస్యలే అని చెప్పేవాళ్లకు చెబుతున్నాను. నిజాలే మాట్లాడతాయి. తమిళ ఇండస్ట్రీలో అదే టీమ్, అదే నటీనటులతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మళ్లీ మళ్లీ పనిచేశాను. కానీ ఈ ఒక్క దర్శకుడు మాత్రమే గీత దాటి ప్రవర్తించాడు. అవమానించేలా నాపై కామెంట్స్ చేశాడు. వాటిని బయటపెట్టాడు. అందుకే నేను స్పందించాల్సి వచ్చింది. ఇంకా నిన్ను నువ్వు సమర్థించుకుంటే మాత్రం అది నీ ఇష్టం' అని దివ్య భారతి రిప్లై ఇచ్చింది. తంలో ఈ దర్శకుడు.. విశ్వక్ సేన్ హీరోగా 'పాగల్' తీశాడు. కానీ సమస్య ఏంటో గానీ మధ్యలోనే బయటకొచ్చేశాడు. ఇప్పుడు 'గోట్' విషయంలోనూ ఇలానే జరిగింది. అయితే దర్శకుడిని విమర్శించిన హీరోయిన్ దివ్య భారతి.. హీరో సుడిగాలి సుధీర్‌ని కూడా వివాదంలోకి లాగింది. మరి అతడు ఏం సమాధానం చెబుతాడో చూడాలి?

# నా పేరుతో మోసం... ఎవరీ ఇడియట్?

టెక్నాలజీ పెరిగిపోయిన తర్వాత ఏది నిజమో ఏది అబద్ధమో అర్థం కావట్లేదు. ఎందుకంటే మన పేరుని, ఫోన్ నంబర్లని ఎంతలా మోసాలకు ఉపయోగిస్తున్నారో చూస్తూనే ఉన్నాం. ఇప్పుడు టాలీవుడ్ హీరోయిన్లు కూడా ఇలాంటి ఓ స్కామ్ బారిన పడుతున్నారు. రెండు రోజుల క్రితమే హీరోయిన్ అదితీ రావు హైదరీ తన పేరుతో వాట్సాప్‌లో మోసం జరుగుతుందని బయటపెట్టగా.. ఇప్పుడు ఇదే తరహాలో తన పేరుతోనూ జరుగుతోందని శ్రియ పోస్ట్ పెట్టింది. ఇప్పుడు ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. బుధవారం ఉదయం శ్రియ ఓ పోస్ట్ పెట్టింది. ఇందులో ఓ తన ఫొటోతో ఉన్న ఫోన్ నంబర్ స్క్రీన్ షాట్ తీసి పెట్టింది. ఇది తన నంబర్ కాదని, తన పేరుతో సెలబ్రిటీలకు మెసేజ్ చేసి వాళ్ల టైమ్ వేస్ట్ చేయొద్దని పేర్కొంది. తాను అభిమానించే వ్యక్తులకు.. కలిసి సినిమాలు చేయాలని ఉందని చెబుతూ సదరు వ్యక్తి ఫేక్ వాట్సాప్ ఖాతా నుంచి మెసేజులు పెడుతున్నాడని, ఇది తన దృష్టికి వచ్చిందని చెప్పుకొచ్చింది. దీనిపట్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. శ్రియ కెరీర్ విషయానికొస్తే అప్పట్లో తెలుగు, తమిళ, హిందీలో హీరోయిన్‌గా చేసింది. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్, ఐటమ్ సాంగ్స్ చేస్తోంది. ఈ ఏడాది 'మిరాయ్'లో తల్లిగా ఆకట్టుకుంది. ప్రస్తుతం 'నాన్ వయలెన్స్' అనే తమిళ మూవీ చేస్తోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com